بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 09.08.2019 (Telugu)**

## జల్సా సాలానా ఇంగ్లాండ్‌లో పాల్గొన్న గౌరవనీయ అతిథుల విశ్వాసభరిత అభిప్రాయములు

### హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 09.08.2019 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్, మోర్డన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. గత ఆదివారము రోజున మూడు రోజుల జల్సా సాలానా ఇంగ్లాండ్ అల్లాహ్ తఆలా కృపానుసారము ముగిసినది. అల్లాహ్ తఆలా అనన్య శుభములు ఈ జల్సాల ద్వారా లభించును. అల్లాహ్ తఆలా దయానుగ్రహముతో వాటిని మనము పొందుతాము. ఏ విభాగములో లేదా ఏదేని విభాగములో ఎటువంటి ఏ స్థాయిలోనైనా సేవలందించిన స్త్రీ, పురుషులందరికి మొదట నేను కృతజ్ఞతలు కూడ తెలుపదలచితిని. సహాయకుని నుండి అధికారి స్థాయి వరకు స్త్రీ, పురుషులు, పిల్లలు, యువకులు, వయోజనులు అందరు నిస్వార్థముగా తమ తమ విధులు, బాధ్యతలను నిర్వర్తించిరి. అతిథుల ముందు తమ కర్మలతో ఇస్లాం నిజమైన చిత్రము చూపుచుండిరి. హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇప్పుడు నేను కొందరి అభిప్రాయాలను ప్రవేశపెట్టుతాను.

బెనిన్ ముస్లిం కమ్యూనిటి వైస్ ప్రెజిడెంట్ మాలేహూ యాకూబ్ గారిట్లనిరి. నేను 20 సార్ల కంటే అధికంగా హజ్ చేసినాను. కాని అంతకంటే మెరుగైన ఏర్పాట్లు చేసినట్లు అహ్మదియ్య జమాఅత్ జల్సలో పాల్గొన్నందుకు నాకు తెలిసినది. నేను అనేక ధార్మిక సభలు, సమావేశములలో పాల్గొన్నాను. కాని జల్స సాలానా లాంటి వాతావరణము నాకెక్కడ కనిపించలేదు. ఇక్కడికి వచ్చి నేను చాలా నేర్చుకున్నాను. అహ్మదియ్యత్ మాత్రమే నిజమైన ఇస్లాం. ఇతరుల మాటలు వినకుండా అహ్మదియ్యత్‌ను నేర్చుకోవాలని నేను బేనిన్ చేరుకున్న తరువాత ప్రజలకు సూచింతును. అహ్మదీయులు మాత్రమే ప్రపంచములో ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన గొప్పతనమును ప్రచారము చేయుచున్నారు.

యూనాన్ నుండి చీఫ్ రవాయె గేబ్రియల్ గారిట్లనిరి. ఈ అద్భుతమైన అంతర్జాతీయ స్థాయి జల్సలో భాగస్వామి అగు అనుగ్రహము లభించినందుకు నేను అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలుపుచున్నాను. ఇతర మతాల పట్ల గౌరవము, మర్యాదను ఒక రబాయెగా నేనిక్కడి చూచినాను. అనేక ఇమామ్‌లతో భేటి అయ్యే అవకాశము నాకిక్కడ లభించినది. వారందరు ఎంతో గౌరవము, మర్యాద పూర్వకంగా నాతో వ్యవహరించారు. నేను నా ప్రత్యేక టోపీని ధరించి నిరాటంకముగా ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ఆగ్రహము, కోపము గల చూపులు లేకుండానే వేలాది ముస్లిం సోదరుల మధ్య తిరుగుచుంటిని. ఇతర ప్రాంతాలలో ఇందుకు భిన్నంగా నాకు అనుభమయ్యేది.

విశ్వవిద్యాలయములో ఓరియంటల్ స్టడీస్‌లో ఆచార్య అయిన ఒక మహిళ అతిథురాలు యురోగ్వే నుండి వచ్చిరి. వారిట్లనిరి. గత 30 సంవత్సరముల కంటే అధిక కాలము నుండి నేను ముస్లిం దేశములు, సంస్థల గురించి పరిశోధన చేస్తున్నాను. మీ సభలో పాల్గొన్నందుకు మరెక్కడా కనిపించని రెండు క్రొత్త విషయములను చూచితిని. మొదటి విషయమేమనగా జమాఅత్ ఐక్యత, ఒక నాయకుని ద్వారా ఏర్పడిన ఇలాంటి ఐక్యతను నేనెక్కడ చూడలేదు. ప్రతి ఒక్కరు తమ ఖలీఫాతో విధేయత, వినమ్రతతో కూడిన అసాధారణ బంధము కలిగివున్నారు. రెండవ విషయమేమనగా మీ జమాఅత్‌లో జాతి వివక్ష లేనే లేదు. జన్మతః అహ్మదీ అయినను లేదా క్రొత్తవారైనను లేదా అరబ్ అయినను లేదా అరబ్బేతరులైనను లేదా పాకిస్తానీలైనను పాకిస్తానీలు కాక పోయినను మీ జమాఅత్‌లో ఎలాంటి జాతి వివక్ష, జాతి అసూయ నామ మాత్రానికి కూడ కనిపించదు.

ఫిలాసఫీలో ఆచార్య అయిన ఒక మిత్రులు మరాకిష్ నుండి వచ్చిరి. వారిట్లనిరి. మేము జల్సలో చాలా మంచి ప్రభావము పొందాము. జమాఅత్‌ను క్షుణ్ణంగా పరిశీలించుటకు ఇదొక సదవకాశము. మేము ఈ సభలో జమాఅత్ అద్వితీయ నిర్వహన, బాధ్యతల అప్పగింత, అతిథుల గొప్ప స్వాగతమును తిలకించినాము. ఇస్లాం, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధనల ప్రతిరూపమైన అహ్మదియ్య జమాఅత్ సత్ప్రవర్తనలను కూడ

మేము చూచినాము. ఈ సభ ద్వారా వ్యతిరేకుల అసత్య ప్రచార భండారము కూడ బట్టబయలైనది. వీరు అనవసరంగా ఈ దైవ సంస్థ పట్ల అసూయ, శతృత్వము నెరపుచున్నారు. ప్రజా సేవ చేయుటకు అల్లాహ్ తఆలా తమరిని అనుగ్రహించు చుండు గాక!

మతపరమైన అంశముల ఇన్స్‌పెక్టర్ జనరల్ అయిన అల్‌హాజ్ ముహమ్మద్ వకీల్ యాతారా గారు గనాకరి నుండి వచ్చిరి. వారిట్లనిరి. ఈ మూడు రోజులలో నన్ను అన్నిటికంటే ఎక్కువ ప్రభావితం చేసిన విషయమేమనగా అహ్మదీ సభ్యుల శిక్షణ స్వచ్ఛమైన ఇస్లామీయ బోధనల ప్రకారము చేయబడెను. ఇక్కడ గుమికూడిన అహ్మదీయులందరు ఇస్లామీయ సోదరభావమునకు అతి గొప్ప ఉదాహరణగా, ఒకే తల్లి సంతానము వలె, ఒకే కుటుంబము నుండి వచ్చినట్లు కనిపించుచున్నారు. సాటిలేని క్రమశిక్షణ, చిరునవ్వుతో పలకరిస్తున్న సేవకుల ముఖములు, ఎవరికి ఇబ్బంది కలిగించకుండా సభా ప్రాంగణమునకు వచ్చి పోవుటను చూచి వీరు ఆకాశ ప్రాణులని అనిపించుచుండెను. నేడు ఎవరైనా ఇస్లాం జమాఅత్‌గా పేరుతెచ్చుకున్నారంటే అది అహ్మదియ్యా జమాఅత్ మాత్రమే. ఇతర ముస్లిం దేశాలే కాక సవూది అరబ్‌ను కూడ నేను అనేకసార్లు సందర్శించాను. కాని నేను అనుభవపూర్వకంగా చెప్పునదేమనగా ఇలాంటి ఇస్లామీ సోదరభావముతో కూడిన వాతావరణము నేనెక్కడ చూడలేదు. సుమారు 40 వేల మందిని ఒక చోట సమావేశ పరచుట, వరుసగా మూడు రోజుల వరకు ఇస్లామీ బోధనల ప్రచారము చేయుట, ఎలాంటి వివాదము, గందరగోళము లేకుండా అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త ప్రేమలో ఈ రోజులను గడుపుట అహ్మదియ్యా జమాఅత్ ప్రత్యేకత మాత్రమేనని నేను సంకోచించకుండా చెప్పగలను.

గనీకనాకరి కస్టమ్ ఎయిర్‌పోర్ట్‌లో లెఫ్టినెన్ట్ అయిన ఫానితా ఫోకానా ఉమర్ అను మహిళ క్రొత్తగా బైఅత్ చేసిరి. వారిట్లనిరి. అహ్మదియ్యా జమాఅత్ బోధనలతో ప్రభావితమై నేను అహ్మదియ్యత్‌లో చేరినాను. కాని నేను తప్పుడు నిర్ణయము తీసుకున్నానా ? అని మనసులో ఆందోళన చెందుచుంటిని. కాని ఇంగ్లాండ్ జల్సా సాలానాలో పాల్గొన్న తరువాత నేను అల్లాహ్ తఆలా ప్రమాణము చేసి చెప్పగలను. నా సందేహములు, అనుమానములన్నియు దూరమైనవి. నేడు ప్రపంచములో ఇస్లాం జమాఅత్‌గా ప్రాతినిథ్యము వహించే అర్హత అహ్మదియ్యా ముస్లిం జమాఅత్‌నకే గలదని నాకు నమ్మకము కలిగినది.

గేబూన్ మాజీ ప్రధాన మంత్రి, పార్లమెంట్ సభ్యులు పాల్ బియూగే గారు జల్సాలో పాల్గొన్నారు. వారిట్లనిరి. జల్సాలో చేయబడిన ఉపన్యాసముల ద్వారా ఇస్లాం గురించి ప్రత్యేకంగా అహ్మదియ్యత్ గురించి చాలా తెలుసుకునే అవకాశము నాకు లభించినది. అహ్మదీయులు ప్రపంచ శాంతిని చెదరగొడుతున్నారని నేను కూడ ఇతర ముస్లిముల వలె భావించేవాడిని. కాని ఇక్కడికి వచ్చి నేను చాలా ప్రభావితమైనాను. మీరు కష్ట జీవులు. మీరే నిజమైన ముస్లిములు. నేడు ప్రపంచానికి ఈ ఇస్లాం అవసరమున్నది. నా దేశానికి కూడ ఇదే ఇస్లాం అవసరమున్నది.

విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో కేబినెట్ డైరెక్టర్ అయిన పాస్దాలూ వుదూన్కా గారిట్లనిరి. జల్సా వాతావరణము చాలా గప్పొగా వుండెను. ఇదో అద్భుతమైన ఆధ్యాత్మిక వాతావరణము. దీనిని నేనెన్నడు మరచిపోలేను. జల్సాలో పాల్గొని నాకు చాలా నేర్చుకునే అవకాశము లభించినది. ఇస్లాం గురించి చాలా విషయములను తెలుసుకొను, అర్థము చేసుకొను అనుగ్రహము లభించినది. నేను ముస్లిం కాదు. కానిప్పుడు నేను నన్ను ఒక ముస్లిం అని భావించుచున్నాను.

సెంట్రల్ అఫ్రీకన్ రిపబ్లిక్ అధ్యక్షుని సలహాదారులైన హేరీ లెగోన్సా గారిట్లనిరి. ప్రపంచములో సోదరభావమును స్థాపించుటయే అహ్మదియ్యా జమాఅత్ ఏకైక ఉద్ధేశము. ఇందుకు వారు రాత్రింబవళ్ళు కృషి చేయుచున్నారు. కాని ప్రపంచములోని ఇతర సంస్థలలో ఇంతటి గొప్ప వినయ విధేయతలు కనిపించవు.

నా తరపున, నా దేశము తరపున ఈ జల్సా విజయవంతమైనందుకు ఈ సందర్భమున నేను శుభాకాంక్షలు తెలుపుచున్నాను. నా దేశములో కూడ ఈ బోధనలు, ప్రేమను వ్యాపింపజేయాలని నేను అహ్మదియ్యా జమాఅత్‌ను ఆహ్వానించుచున్నాను. సుదీర్ఘ అంతర్యుద్ధము తరువాత నా దేశము ఇప్పుడిప్పుడే శాంతి వైపు అడుగులు వేయుచున్నది. ఈ బోధనల ద్వారా దేశములో సుదీర్ఘ కాలము వరకు కొనసాగే శాంతి స్థాపన సాధ్యమగును. జల్సా వాతావరణమును నేనెన్నడు మరచిపోలేను. ప్రతి సంవత్సరం జల్సాలో పాల్గొని ఆధ్యాత్మిక శాంతిని పొందుటకు ప్రయత్నింతును. ఇందుకు నేను దుఆ చేయుదును. ఇదే స్వచ్ఛమైన ఇస్లాం అని నేను తిరిగి పోయిన తరువాత అహ్మదియ్యా జమాఅత్ సందేశమును అందించెదను.

పెట్రోపొలిక్స్ సిటి కౌన్సిల్ అధ్యక్షులైన మోరోహెన్రీ నామము గల బ్రాజీల్ అతిథి ఇట్లనిరి. నా దేశమైన బ్రాజీల్ ప్రతినిధిగా నేను ఈ గొప్ప ఇస్లామీ జల్సలో పాల్గొన్నందుకు నాకు అంతులేని ఆనందము కలుగుతుంది. వర్తమాన ఖలీఫా ఉపన్యాసములన్నియు స్వచ్ఛమైన ఇస్లాం ప్రతిరూపముగా వుండెను. వారి మాటలు వాటంతటఅవే మనసులో దిగి పోవును. జల్స మూడు రోజులను నేను ఆధ్యాత్మిక వాతావరణములో గడిపినాను. ఎలాంటి అలసట లేదా విసుగు నాకు కలుగలేదు. జల్సలో నమాజ్ సందర్భమున ఒక్క పిలుపుపై అందరు నిలబడు, కూర్చొను దృశ్యము నా కొరకు అసాధారణ, ఆశ్చర్యముగా యుండెను. నాపై అసాధారణ ప్రభావము చూపిన మరో విషయమును ప్రస్తావించనిదే నేను వుండలేను. అదేమనగా ఖలీఫా ఎక్కడికి వచ్చినా వేలాది సభ్యుల సమూహాము ఒక్కసారిగా మౌనము పాటించును. ఎవరికి ఏమియును చెప్పవలసిన అసవరముండదు. దీనితో తెలిసినదేమనగా వ్యవస్థలో మాత్రమే కాక అందరి హృదయములలో ఖలీఫా కొరకు అంతులేని గౌరవ, మర్యాదలున్నవని స్పష్టమగుచున్నది. ఈ మధుర స్మృతులతో నేను తిరిగి వెళ్ళుచున్నాను. నాకు అవగతమైన విషయములను నేను నా సెంటర్‌లో, కౌన్సిల్‌లో ప్రస్తావింతును. వాస్తవానికి ఇదే నిజమైన ఇస్లాం.

తమ ప్రాంతములో బిషప్ అయిన లీ మేసిస్ గారు ఎక్వడోర్ నుండి వచ్చిరి. వారిట్లనిరి. జల్స ఏర్పాట్లు చాలా గొప్పగా వుండెను. మన లక్ష్యమును మార్చుటకు కావలసిన విషయములన్ని ఖలీఫా ఉపన్యాసములలో వున్నవి. వారి ఉపన్యాసములో నాకు నచ్చిన ముఖ్యమైన విషయమేమనగా వారు ఏ జాతి లేదా మతము గురించి వ్యతిరేకంగా ఏమి మాట్లాడలేదు. ఇస్లాం స్వచ్ఛమైన, సానుకూల బోధనలపైనే వారి పూర్తి దృష్టి యుండెను. ఈ జల్సలో పాల్గొను ఉద్ధేశముతో నేను ఇంటి నుండి బయలు దేరినప్పుడు ఇస్లాం నా దృష్టిలో ఒక మతముగా మాత్రమే యుండెను. కాని ఇస్లాం ఒక మతము మాత్రమే కాక ఒక గొప్ప సోదరభావము, ఒక కుటుంబము, ఒక గృహము వలె వున్నట్లు ఇక్కడికి వచ్చిన తరువాత నాకు తెలిసినది. ఇస్లాం స్థాపించిన సోదరభావ వ్యవస్థ, ధర్మము కొరకు మీరు పడుచున్న శ్రమ, సమర్పించుచున్న త్యాగములను చూచి నేను చాలా ప్రభావితమైనాను. ప్రపంచ బైఅత్ గురించి వారిట్లనిరి. బైఅత్ మొదలు కాగానే ఎవరో ఒకరు నా భుజముపై హస్తము వాల్చిరి. కావున నేను కూడ నా ముందున్న వ్యక్తి భుజముపై చెయ్యి పెట్టినాను. జల్సలో పాల్గొన్న వారందరిలో ఒక విద్యుత్తు కాంతి ప్రవహించుచునట్లు నేను భావించితిని. ఈ బైఅత్ తరువాత అహ్మదీయులు తమను తాము చాలా చురుకుగా భావించుచున్నట్లు, వారికొక క్రొత్త జీవితము లభించినట్లు నేను చూచితిని. ఈ జల్సలో పాల్గొనుటకు, నిజమైన ఇస్లాం బోధనను తెలుసుకొనుటకు నాకు అవకాశమిచ్చినందుకు నేను అందరికి కృతజ్ఞతలు తెలుపుచున్నాను. కొందరి దుష్చర్యల వలన ఇస్లాం ధర్మమును మొత్తం తప్పుగా భావించరాదని నాకిప్పుడు ప్రత్యేకంగా తెలిసినది.

క్రైస్తవ మహిళా ప్రొఫెసర్ అయిన బార్బరా ఓచే గారు స్లేవీనియా నుండి వచ్చిరి. వారిట్లనిరి. అహ్మదియ్య జమాఅత్ ప్రవేశపెట్టుచున్న ఇస్లాంను నేనెన్నడు చూడలేదు. జల్సను చూచి నేనొక క్రొత్త ఇస్లాంను చూస్తున్నాని భావించితిని. హజ్రత్ ఈసా అలైహిస్సలాం శిలువ సంఘటన, ప్రస్థానము, మృతి గురించి అహ్మదియ్య జమాఅత్ అభిప్రాయము అన్నిటికంటే ఎక్కువ నమ్మదగ్గ, వాస్తవాల ప్రకారమున్నట్లు కనిపించుచున్నది.

జన్మతః ముస్లిం అయిన రచయిత మోనస్ సీనానోవిచ్ గారు స్లేవీనియా నుండి వచ్చిరి. వారికిప్పుడు ఇస్లాం పట్ల అసక్తి లేకుండెను. వారిట్లనిరి. గత రెండు సంవత్సరముల నుండి నేను ఇస్లాం గురించి చదవడం మొదలు పట్టాను. కాని ఒక ఇమామ్ వెనుక ఎన్నడు నమాజ్ చేయలేదు. కాని ఇక్కడికి వచ్చిన తరువాత జమాఅత్‌తో కలిసి నమాజ్ చదవడంలో ఒక క్రొత్త అనుభూతి కలుగుతుంది. ఇస్లాం గురించి నేను భావించుచున్న ఇస్లాం అహ్మదియ్య బోధన ఒకే విధముగా వున్నది. అనగా ప్రతిది సహజ స్వభావము మేరకున్నది. హుజూరె అన్వర్ ఇట్లనిరి. వారికి నచ్చిన మరో విషయమేమనగా అహ్మదీయులు చెప్పినదే చేస్తారు. హుజూరె అన్వర్ ఇట్లనిరి. మన కొరకు ఇదొక పెద్ద సవాలు. మన మాటలు చేతలు ఒకే విధముగా వుండవలెను. మనము చెప్పేదే చేయవలెను.

వాటికన్ ఇస్లామీ విశ్వవిద్యాలయములో పి.ఎచ్.డి పట్టా పొందిన మెడాలీనా గారు ఇటలీ నుండి వచ్చిరి. ఆమె ఇట్లనిరి. జల్స సాలానా ఎంతో ఆసక్తికరమైన, శాంతియుత, ఆప్యాయతతో నిండి యుండెను. ప్రతి ఏర్పాటు చక్కగా వుండెను. ప్రసంగములు చాలా గొప్పగా వుండెను. అహ్మదీయులకు మాత్రమే కాక అతిథులందరి జ్ఞానమును పెంపొందించే విధముగా వుండెను.

జవాద్ బోలామిల్ గారు ఫ్రాన్స్‌లో మినిస్టరి ఆఫ్ జస్టిస్‌లో పని చేస్తారు. వారిట్లనిరి. జల్స రోజులలో

ఐ.ఏ.ఏ.ఏ.ఇ., హ్యుమేనిటి ఫస్ట్ ప్రదర్శనశాలను సందర్శించి మీ జమాఅత్ అభివృద్ధి కార్యక్రమాలను చూచి చాలా ప్రభావితమైనాను. కుల మతాలకతీతంగా ప్రజా సేవ చేయుచున్న నిజమైన ధర్మము ఇదే.

స్పెయిన్ బృందములో ఒక అతిథురాలు సోజానా మోరాల్ గారుండిరి. ఆమె ఇట్లనిరి. "ప్రేమించు అందరిని, ద్వేషించకు ఎవ్వరిని" అనే నినాదమునకు ఈ గొప్ప సభ చిహ్నముగా నిలిచినది. విభిన్న రకాల ప్రజలను కలుస్తున్నట్లు నేను చూచితిని. ప్రపంచములో శాంతి స్థాపనకు కృషి చేయుటకు, అన్యాయమునకు విరుద్ధంగా యుద్ధము చేయుటకు ఈ మతమునకే అర్హత గలదు.

బ్రిటిష్ సొసైటి ఆఫ్ ట్యూరిన్ ష్రౌడ్ మాజీ సంపాదకులైన ఓర్ఫే గారిట్లనిరి. క్రమం తప్పకుండా ఐదు సంవత్సరముల నుండి నేను జల్సకు వస్తున్నాను. నేను మొదటి సారి జల్సలో పాల్గొన్నప్పుడు ఈ వాతావరణములో భావించిన దుఆలతో పరిపూర్ణమైన గొప్ప అనుభూతిని నేటికి నేను మరచిపోలేదు. ష్రౌడ్ ఆఫ్ ట్యూరిన్ నిపుణుడను నేను. ఈ వస్త్రమునకు అహ్మదియ్యా జమాఅత్‌లో చాలా ప్రాముఖ్యత గలదు. ఎందుకనగా వారి దృష్టిలో మసీహ్ శిలువపై మరణించలేదనుటకు ఇదొక గొప్ప సాక్ష్యము.

అబ్రెంజిల్ కమ్యూనిటి ప్రతినిధి చీఫ్ మెయింగమ్ హెన్రీ కెనడా నుండి వచ్చిరి. వారిట్లనిరి. జల్స సాలానాలో పాల్గొనుట నా కొరకు చాలా ముఖ్యమైన విషయము. ఎందుకనగా దీని వలన నా జీవితము మారిపోయినది. ఇప్పుడు నాకు ఇస్లాం గురించి గతము కంటే చాలా ఎక్కువ అవగాహన కలిగినది. ఇస్లాం, కెనడా ప్రాచీన మతములో చాలా విషయములు పోల్చి వున్నవని నేను భావించుచున్నాను.

డైరెక్టర్ ఆఫ్ న్యూజ్ ఎఫ్.ఎమ్. శ్రీమతి వెనె ట్రివ్ బెలీజ్ అతిథురాలు ఇట్లనిరి. అహ్మదీయులలో నేను చూచిన ఐక్యత మానవునిలో నూతనోత్తేజము నింపునట్టిది. దానిని చూచి శాంతిని పొందు కోరిక మనసులో తలెత్తును. ఏర్పాట్లు చాలా చక్కగా వుండెను. ఇమామ్ జమాఅత్ ప్రసంగములు ప్రస్తుత కాలమునకు అనుగుణంగా యుండెను.

పోలీస్ కమీషనర్ అయిన చెస్టర్ విలియమ్ గారు బెలీజ్ నుండి వచ్చిరి. వారిట్లనిరి. ముస్లిములందరు ఒక్కటే అని ఈ జల్సలో పాల్గొనక ముందు నేను భావించేవాడిని. చాలా వర్గములున్నవని ఇప్పుడు అర్థమైనది. ప్రశంసించదగ్గ విషయమేమనగా అహ్మదీయులు శాంతిని ప్రోత్సహిస్తారు. యువకుల సంస్కరణ కొరకు చాలా సమయము కేటాయిస్తారు.

మెక్సికో నుండి విచ్చన శ్రీమతి మారియా గారిట్లనిరి. నేను ఇస్లాం స్వీకరించి రెండు నెలలు మాత్రమే అయినది. ఇస్లాం గురించి నాకు చాలా సందేహాలుండెను. జల్సలో పాల్గొన్నందుకు ఇస్లాం గురించి నా అవగాహన పెరిగినది. నా సందేహాలు, ప్రశ్నలన్నిటికి సమాధానము లభించినది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. జల్సలో పాల్గొన్న అహ్మదీయులందరి విశ్వాసమును ఈ జల్స పెంచుగాక!

గౌ॥ ముజీబుర్రహ్మాన్ అడ్వకేట్ గారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని ఖుత్బా చివరలో హుజూరె అన్వర్ ప్రకటించిరి. వీరు 30 జూలై 2019వ తేదీన రబ్వాలోని తాహిర్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో 85 సంవత్సరముల వయసులో మృతి చెందిరి.

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

| From, | To, |
| --- | --- |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |